నమస్తే తెలంగాణ
యాదాద్రి భువనగిరి
I హైదరాబాద్, గురువారం 5 సెప్టెంబర్ 2024 YADADRI BHUVANAGIRI

## మాచనపల్లిలో మునిగిన పొలాలు

నూతనకల్ : మండల పరిధిలోని మాచనపల్లి గ్రామంలో వరదకు పొలాలు నీట మునిగాయి. పాలేరు వాగు నుంచి వచ్చే వరద, చిన్ననెమిల చెరువు నుంచి వచ్చే అలుగుతోపాటు కొత్త కుంట చెరువు కట్ట తెగడంతో పక్కన్నే ఉన్న సుమారు 12 మంది రైతుల 12 ఎకరాల్లో వరి నీట మునిగింది. పంట పొలాలు ఇసుక మేటలతో నిండిపోయాయి. ప్రభుత్వం ఆదుకోవాలని రైతులు కోరుతున్నారు.


నూతనకల్ : ఇసుక మేటలతో మాచనపల్లి గ్రామంలోని పొలాలు

# ఎటు చూసినా కన్నీటి గాథలే..

## వర్షంతో సూర్యాపేట జిల్లాలో భారీ నష్టం

- నీట మునిగిన పంటలు, ఇండ్లలోకి చేరిన నీటితో ప్రజల ఇబ్బందులు
- నష్టం అంచనాల్లో అధికారులు..


తొగర్రాయిలో తడిసిన ఇంటి వస్తువులను బయట వేసి ఆరబెట్టుకుంటున్న ఓ కుటుంబం

**భారీ వర్షాలు, వరద సూర్యాపేట జిల్లా ప్రజలకు తీవ్ర నష్టం మిగిల్చాయి. కాలనీలు, ఇండ్లల్లోకి చేరిన నీటితో ప్రజలు ఇబ్బంది ఎదుర్కొంటున్నారు. నీట మునిగిన పొలాలు రైతులకు కోలుకోలేని దెబ్బ మిగిల్చింది. రోడ్లు మరమ్మతులకు గరవడంతో రాకపోకలు అంతరాయడం ఏర్పడింది. ప్రభుత్వ నుంచి సాయం అందక వర్ష బాధితులు ఎదురుచూస్తున్నారు. ఎటు చూసినా కన్నీటి గాథలే వినిపిస్తున్నాయి.**

### పొలాలన్నీ ఇసుక మేటలే..

- వరదలతో నష్టపోయిన తొగర్రాయి, రెడ్లకుంట, చిమిర్యాల, కూచిపూడి గ్రామాలు
- తడిసిన వడ్లు, బియ్యం
- గడ్డివాములు తడిసి పశువులకు మేత కొరత
- పలు ఇండ్లలో తొలగని బురద

కోదాడ రూరల్, సెప్టెంబర్ 4 : భారీ వర్షాలు, వరద ధాటికి కోదాడ మండల పరిధి తొగర్రాయి, కూచిపూడి, రెడ్లకుంట, చిమిర్యాల గ్రామాలు అతలాకుతమయ్యాయి. పంట పొలాలు పూర్తిగా దెబ్బతిన్నాయి. వందల ఇండ్లలోని వడ్లు, బియ్యం, నిత్యావసర వస్తువులు, గడివాములు తడిశాయి. టీవీలు,ఫ్రిజ్‌లు కొట్టుకొనిపోయాయి. విద్యుత్ స్తంభాలు, ట్రాన్స్‌ఫార్మర్లు నేలకొరిగాయి. చిలుకూరు మండల పరిధి నారాయణపురం చెరువు, గ్రామ శివారు చెరువు వర్షానికి కట్టలు తెగిపోవడంతో తొగర్రాయి, కూచిపూడి గ్రామాలు నీట మునిగాయి.

దీనికి తోడు నడిగూడెం మండలం కాగితంరామచంద్రపురం వద్ద సాగర్ ఎడమ కాల్వకు పడిన గండి పడడం, పాలేరు వాగు ఉప్పొంగడంతో చిమిర్యాల, రెడ్లకుంట గ్రామాలు జలమయమయ్యాయి. పొలాలు పూర్తిగా కొట్టుకొనిపోయాయి. తొగర్రాయిలో సుమారు 250 ఎకరాలు, కూచిపూడిలో 200, రెడ్లకుంటలో 100, చిమిర్యాలలో 80 ఎకరాల పంట పొలాలు నీటి మునిగాయి. రెడ్లకుంట వాగు సమీపంలో నిర్మించి వైకుంఠధామం పూర్తిగా ధ్వంసమైనది. అధికారులు యుద్ధ ప్రాతిపాదికన విద్యుత్‌ను పునరుద్ధరించడంతోపాటు తాగునీటి సమస్యను తీర్చారు. రైతులు, ప్రజలకు ఈ వరద తీవ్ర నష్టం కలిగించింది. ప్రభుత్వం తక్షణమే స్పందించి నష్టపోయిన వారిని ఆదుకోవాలని కోరుతున్నారు.

#### రెండెకరాల పొలం ఇసుక మేటతో నిండింది



భారీ వరదతో వాగు పక్కన ఉన్న మా రెండెకరాల వరి పొలం పూర్తిగా ఇసుక మేటతో నిండిపోయింది. ఆ ఇసుకను తరలించాలంటే వేల రుపాయలు ఖర్చవుతుంది. కాల్వ నిండి రెండు పంటలు పండుతాయనుకుంటే వరదతో పొలం మొత్తం ధ్వంసమైంది. నాతో పాటు గ్రామంలో వందల ఎకరాల్లో పంట పొలాలు దెబ్బతిన్నాయి. రైతులను ప్రభుత్వ ఆర్థికంగా ఆదుకోవాలి.

**- బాలెబోయిన ఏడుకొండలు, రైతు, తొగర్రాయి, కోదాడ మండలం**


కోదాడ మండలం తొగర్రాయిలో పంట పొలాల్లో ఇసుక మేటలు

### కోదాడలో జన జీవనం అస్తవ్యస్తం

- కోట్లలో ఆస్తి నష్టం
- నీట మునిగి చెడిపోయిన కార్లు, బైకులు


మరమ్మతులకు గురైన రోడ్డు పక్కనే వరద ప్రవాహానికి దెబ్బతిన్న గోడ

కోదాడ /కోదాడటౌన్ : భారీ వర్షంతో కోదాడ పట్టణంలో జన జీవనం అస్తవ్యస్తమైంది. పట్టణంలోని 28వ వార్డుతో పాటు షిరిడీ సాయి నగర్, భవానీనగర్ ప్రాంతా ల్లో నీరు ఇండ్లలోకి ప్రవేశించడంతో భారీ ఆస్తి నష్టం జరిగింది. రహదారులు సైతం దెబ్బతిన్నాయి. 28వ వార్డులో పల్లెబోయిన నాగరాజు ఉమారాణిలకు చెందిన సుమారు రూ. 1.60 లక్షల విలువ గల బర్రెలు వరద ప్రవాహంతో మృతి చెందాయి. భవానీనగర్‌లో ఓ ఇంటి ప్రహరీ సైతం కూలింది. 200లకు పైగా ద్విచక్ర, కార్లు వరద నీటిలో మునిగి మరమ్మతులకు గురయ్యాయి. ప్రధాన రహదారిపై ఉన్న డ్రైనేజీని గత 10 రోజుల నుంచి మరమ్మతులు చేపట్టంతో వర్షం నీరు షాపింగ్ కాంప్లెక్స్‌లోకి ప్రవేశించి సెల్లార్‌లో 4 నుంచి 5 అడుగుల మేర నీరు నిలిచింది. దాంతో కొన్ని కాంప్లెక్స్‌లలో వివిధ రకాల వ్యాపారాలకు తీవ్ర ఆటంకం ఏర్పడింది.

#### రూ. 50 లక్షలు ఆస్తి నష్టం జరిగింది



శనివారం కురిసిన వర్షంతో మా షాపులోకి వరద నీరు చేరింది. 7 అడుగుల మేర నీరు ఉండడంతో ఎరువుల కట్టలు మొత్తం నీటిలో తడిచి కరిగిపోయినాయి. నాట్ల సీజన్ కావడంతో ఇటీవలే ఎరువుల సంచులను తెప్పించాం. వాటి విలువ సుమారు 50 లక్షల వరకు ఉంటుంది. డ్రైనేజీలు చిన్నగా ఉండడంతో నీళ్లు ఎటు పోలేక దుకాణాల్లోకి చేరాయి. అధికారులు మరల ఇటువంటివి జరుగకుండా చర్యలు తీసుకోవాలి.

**-ఓరుగంటి వెంకటేశ్వర్లు, యాజమాని లక్ష్మి ఫర్టిలైజర్స్, కోదాడ.**

## నల్లగొండ జిల్లాలో 1853 ఎకరాల్లో పంట నష్టం

**786 ఎకరాల్లో వరి, 1067 ఎకరాల్లో పత్తి**

నల్లగొండ ప్రతినిధి, సెప్టెంబర్4(నమస్తే తెలంగాణ) : ఇటీవల నల్లగొండ జిల్లాలో కురిసిన భారీ వర్షాలతో భారీగానే పంటలకు నష్టం వాటిల్లింది. శని, ఆదివారాల్లో కురిసిన వర్షాలతో వరదలు వచ్చి పంటలు నీట మునగడం, కొట్టుకోవడం ఎక్కువగా జరిగింది. దీంతో అధికారులు జిల్లా వ్యాప్తంగా పంట నష్టంపై అంచనాలు రూపొందిస్తున్నారు. ఓ రైతు వేసిన పంటలో 33శాతం పైగా దెబ్బతింటేనే దాన్ని నష్టంగా ప్రభుత్వం పరిగణిస్తుంటుంది. ఈ లెక్కల ప్రకారమే జిల్లా వ్యవసాయ శాఖ బుధవారం వరకు వేసిన నష్టం అంచనాలను వెల్లడించింది. మొత్తం 1,853 ఎకరాల్లో 795 మంది రైతులకు సంబంధించిన వివిధ పంటలు దెబ్బతిన్నట్లుగా క్షేత్రస్థాయిలోని వ్యవసాయ అధికారులు లెక్కలు వేశారు. ఇందులో 514 మంది రైతులకు చెందిన వరి పంట 786 ఎకరాల్లో దెబ్బతినగా, 278 మందికి సంబంధించిన 1,067 ఎకరాల్లో పత్తి పంట, ముగ్గురు రైతులకు చెందిన మూడెకరాల మిర్చి పంటకు నష్టం వాటిల్లింది. దామచర్ల, మాడ్గులపల్లి, వేములపల్లి, గుర్రంపోడు, పెద్దవూర, చందంపేట, శాలిగౌరారం, కేతేపల్లి, చండూరు, డిండి, నకిరేకల్ మండలాల పరిధిలోని 36 గ్రామాల్లో ఈ పంటనష్టం జరినట్లుగా అంచనాలు రూపొందించారు. క్షేత్రస్థాయి నుంచి వస్తున్న సమాచారం మేరకు వేలాది ఎకరాల్లో పంటలకు నష్టం వాటిల్లింది. ఒక్క నల్లగొండ జిల్లా పరిధిలోనే సుమారు ఆరు వేల ఎకరాల్లో పంటలు దెబ్బతిన్నట్లు తెలుస్తున్నది. అధికారులు పూర్తిగా క్షేత్రస్థాయిలో పర్యటిస్తేనే సమగ్ర నష్టం వివరాలు వెల్లడికానున్నాయి. కాగా వ్యవసాయ శాఖ అధికారులంతా రుణమాఫీ కానీ రైతుల వివరాలు సేకరించే పనిలో బిజీబిజీగా ఉన్నారు. ఓ వైపు ప్రభుత్వ టార్గెట్ ప్రకారం రుణమాఫీ డ్యూటీ చేస్తూ మరోవైపు పంట నష్టం వివరాలు పూర్తి స్థాయిలో సేకరించడం ఏ మేరకు సాధ్యమన్న సందేహాలు నెలకొన్నాయి. ఇక దీనికి తోడు నిబంధనల ప్రకారం వేసిన పంటలో 33శాతం పైగా దెబ్బతింటేనే ప్రభుత్వం పరిగణలోకి తీసుకుంటుంది. దీని వల్ల అంతకంటే తక్కువ స్థాయిలో దెబ్బతిన్న పంట రైతులు నష్టపోతున్నారు. వీరికి త్వరలో ప్రభుత్వం ఏదైనా సాయం అందిస్తే దానికి అనర్హులు కానున్నారు. జిల్లావ్యాప్తంగా పంట నష్టం వివరాల సేకరణ కొనసాగుతుందని జిల్లా వ్యవసాయ శాఖ అధికారి పాల్వాయి శ్రవణ్‌కుమార్ తెలిపారు. ఈ వివరాలన్నింటినీ త్వరలోనే ప్రభుత్వానికి నివేదించనున్నట్లు వెల్లడించారు.


'మట్టి గణపతులనే పూజిద్దాం' వాల్ పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న కలెక్టర్ హనుమంత్ జెండగే

## వర్షాల నేపథ్యంలో ప్రజలను అప్రమత్తం చేయాలి

- కలెక్టర్ హనుమంతు జెండగే

భువనగిరి కలెక్టరేట్, సెప్టెంబర్ 4 : మరో నాలుగైదు రోజులు భారీ వర్షాలు ఉన్నాయని వాతావరణ శాఖ హెచ్చరిక నేపథ్యంలో క్షేత్ర స్థాయి అధికారుల వరకు జాగ్రత్తగా ఉండాలని, ప్రజలను అప్రమత్తం చేయాలని కలెక్టర్ హనుమంతు కె.జెండగే అధికారులను ఆదేశించారు. మున్సిపల్ కమిషనర్లు, వైద్యారోగ్య శాఖ అధికారులు, మండల స్పెషల్ ఆఫీసర్లు, తాసీల్దార్లు, మండల అభివృద్ధి అధికార్లు, మండల పంచాయితీ అధికారులు, పంచాయతీరాజ్, రోడ్లు భవనాల శాఖ ఇంజినీర్లు, విద్యుత్ అధికారులతో ఆయన గూగుల్ జూమ్ మీటింగ్ ద్వారా సమీక్షించారు. వర్షాలు, వరదల పట్ల తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ఆదేశాలు జారీ చేశారు. ఈ నెల 9 వరకు అప్రమత్తంగా ఉండాలన్నారు. హైదరాబాద్ నుంచి వచ్చే మూసీ నది వరదల వల్ల రోడ్లు దెబ్బతినే అవకాశం ఉన్నందున జాగ్రత్తగా ఉండాలని, చెరువుల వద్దకు ఎవరినీ వెళ్లనివ్వద్దని తెలిపారు. వర్షాలు, వరదల వల్ల నష్టం వాటిళ్లకుండా చూడాలని, అవసరమైన చోట జేసీబీ, ట్రాక్టర్స్, గజ ఈతగాళ్లను సిద్ధంగా ఉండాలని సూచించారు. ముంపు ప్రాంతాల పట్ల నిరంతర పర్యవేక్షణ ఉండాలని, శిథిలావస్థలో ఉన్న ఇండ్లలోని వారికి కమ్యూనిటీ హాళ్లలో బస ఏర్పాటు చేయాలని తెలిపారు.

### పర్యావరణాన్ని రక్షించే బాధ్యత మనందరిది

పర్యావరణాన్ని రక్షించే బాధ్యత మనందరిపైనా ఉందని కలెక్టర్ హనుమంత్ కె. జెండగే తెలిపారు. కలెక్టర్ కార్యాలయంలో జిల్లా పొల్యూషన్ కంట్రోల్ బోర్డు ఆధ్వర్యంలో బుధవారం 'మట్టి గణపతులనే పూజిద్దాం' పోస్టర్లను ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వినాయక చవితి పండుగను పురస్కరించుకొని మట్టి గణపతి విగ్రహాలపై అవగాహన కల్పిస్తున్నామని తెలిపారు. పర్యావరణానికి అనుకూలమైన మట్టి విగ్రహాలను ఏర్పాటు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ కె.గంగాధర్, జిల్లా గ్రామీణభివృద్ధి అధికారి నాగిరెడ్డి, పీసీబీ ఎన్విరాన్‌మెంటల్ ఇంజినీర్ సంగీత, అసిస్టెంట్ పర్యావరణ శాస్త్రవేత్త ఎం.రామకృష్ణ, భువనగిరి మున్సిపల్ కమిషనర్ రామానుజుల రెడ్డి, జిల్లా పంచాయతీ అధికారి సునంద, జిల్లా వెనుకబడిన తరగతుల అధికారి యాదయ్య, జిల్లా పౌర సంబంధాల అధికారి పి.వెంకటేశ్వర్‌రావు, జిల్లా పశుసంవర్ధక అధికారి కృష్ణ, కలెక్టరేట్ పరిపాలన అధికారి జగన్మోహన్ ప్రసాద్ పాల్గొన్నారు.

## నార్మూల్ డైరెక్టర్లకు బీఆర్‌ఎస్ నుంచి ఐదుగురు నామినేషన్


నామినేషన్ దాఖలు చేస్తున్న బీఆర్‌ఎస్ పార్టీకి చెందిన సభ్యులు, చిత్రంలో ఎన్‌డీసీసీబీ మాజీ చైర్మన్ గొంగిడి మహేందర్‌రెడ్డి, పార్టీ శ్రేణులు

యాదగిరిగుట్ట/రాజాపేట, సెప్టెంబర్ 4 : ఉమ్మడి నల్లగొండ – రంగారెడ్డి పాల ఉత్పత్తిదారుల పరస్పర సంఘం(నార్మూల్) డైరెక్టర్ పదవులకు నామినేషన్ ప్రక్రియ కొనసాగుతున్నది. ఆలేరు నియోజకవర్గానికి చెందిన ఐదురుగు బీఆర్‌ఎస్ పార్టీ నాయకులు నామినేషన్ దాఖలు చేశారు. హయత్‌నగర్‌లోని ప్రధాన కార్యాలయంలో బుధవారం మోటకొండూర్ మండలం దిలావర్‌పూర్ గ్రామానికి చెందిన లింగాల శ్రీకర్ రెడ్డి, యాదగిరిగుట్ట మండలం మైలారిగూడేనికి చెందిన మారెడ్డి కొండల్‌రెడ్డి, మల్లాపురానికి చెందిన ఒగ్గు భిక్షపతి, రాజాపేట పట్టణానికి చెందిన సందిల భాస్కర్‌గౌడ్, ఆలేరు మండలం కొలనుపాకకు చెందిన దొంతిరి సోమిరెడ్డి ఎన్‌డీసీసీబీ మాజీ చైర్మన్ గొంగిడి మహేందర్‌రెడ్డితో కలిసి ఎన్నికల అధికారికి నామినేషన్ అందజేశారు. ఇందులో నలుగురు బరిలో ఉండనుండగా ఒకరు విత్ డ్రా చేసుకునే అవకాశం ఉంది. ఈ సందర్భంగా మాజీ డీసీసీబీ చైర్మన్ మహేందర్‌రెడ్డి మాట్లాడుతూ ఐదు డైరెక్టర్ పదవులను కైవసం చేసుకుంటామన్నారు. పాడి రైతులు బీఆర్‌ఎస్ పార్టీ వెంటే ఉన్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో బీఆర్‌ఎస్ యాదగిరి గుట్ట మండలాధ్యక్షుడు కర్రె వెంకటయ్య, పీఏసీఎస్ చైర్మన్ ఇమ్మడి రామిరెడ్డి, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ గడ్డమీది రవీందర్‌గౌడ్, పార్టీ నాయకులు పైళ్ల సత్యనారాయణరెడ్డి, పల్లె సంతోశ్‌గౌడ్, పాండవుల భాస్కర్, శిఖ శ్రీనివాస్, చింతలపూరి వెంకట్‌రాంరెడ్డి, బెడిదె వీరేశం, కటకం స్వామి, కటకం వెంకటేశం, బాలకృష్ణ పాల్గొన్నారు.

### కాంగ్రెస్ పార్టీ నుంచి నలుగురు

నార్మూల్ డైరెక్టర్ పదవులకు కాంగ్రెస్ పార్టీ నుంచి నలుగురు అభ్యర్థులు నామినేషన్ వేశారు. గూడిపాటి మధుసూదన్‌రెడ్డి, బత్తుల నరేందర్‌రెడ్డి, పుప్పాల నర్సింహ, కళ్లెపల్లి శ్రీశైలం బుధవారం ప్రభుత్వ విప్ బీర్ల అయిలయ్యతో కలిసి ప్రధాన కార్యాలయంలో ఎన్నికల అధికారి వెంకట్‌రెడ్డికి నామినేషన్ పత్రాలను సమర్పించారు.

# రాష్ట్ర వ్యాప్తంగా అతివృష్టి.. సంస్థాన్‌లో అనావృష్టి

**నారాయణపురంలో చుక్క నీరు లేకుండా వెలవెలబోతున్న చెరువులు**

- అడుగంటిన భూగర్భ జలాలు.. ఎండిపోతున్న పొలాలు
- గడ్డు పరిస్థితులను ఎదుర్కొంటున్న రైతులు, ప్రజలు


చుక్క నీరు లేక నెర్రెలు బారిన జానకమ్మ చెరువు


సన్న ధారగా పోస్తున్న బోరు

సంస్థాన్ నారాయణపురం,సెప్టెంబర్4 : రాష్ట్ర వ్యాప్తంగా విస్తారంగా వర్షాలు కురిసి వాగులు పారి చెరువులు నిండి అలుగులు పారుతుంటే సంస్థాన్ నారాయణపురం మండలంలో మాత్రం చెరువుల్లో చుక్క నీరు లేకుండా పోయింది. భూగర్భ జలాలు అడుగంటి బోర్లు పోయక పంట పొలాలు ఎండిపోతున్న వింత పరిస్థితి నెలకొన్నది. మండల వ్యాప్తంగా ఇప్పటి వరకు అనుకున్న స్థాయిలో వర్షాలు కురవకపోవడంతో చెరువులు నెర్రెలుబారాయి. పాతాల గంగ అడుగంటి పోవడంతో బోర్లు సన్న ధారగా పోస్తున్నాయి. మండల వ్యాప్తంగా ఉన్న 120 చెరువుల్లోకి చుక్క నీరు చేరకపోవడంతో వెలవెల బోతున్నాయి. ఈ ఏడాది వర్షాలు కురువాలని ప్రతి గ్రామంలో ప్రజలు కప్ప కాముడు, బొడ్రాయికి నీళ్లతో అభిషేకాలు చేశారు. ఎన్ని పూజలు చేసినా దేవుడు కరుణించడం లేదని, వర్షాలు పడడం లేదన ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అప్పులు చేసి వేసిన పంటలు చేతికి వస్తాయో లేదో అని రైతులు ఆందోళన చెందుతున్నారు. ఈ నెలలోనైనా సమృద్ధిగా వర్షాలు కురిసి చెరువులు, కుంటలు నిండుతాయని ప్రజలు ఎంతో అశతో ఎదురు చూస్తున్నారు.

#### నాలుగు ఎకరాలు పడావు పెట్టిన



నాకు నాలుగు ఎకరాల వ్యవసాయ భూమి ఉంది. పంట చేతికి వచ్చిన ప్రతి సారి అన్ని ఖర్చులు పోను లక్ష రూపాయలు చేతికి వచ్చేవి. నాకు ఊహ తెలిసి ఇప్పటి వరకు మా భూమిని పడావు పెట్టలేదు. వర్షాలు లేక చెరువుల్లో చుక్క నీరు లేక పోవడంతో బోరు ఎండిపోయింది. నీళ్లు లేక పోవడంతో నాలుగు ఎకరాలను పడావు బెట్టిన. దేశమంతా వర్షాలు పడుతుంటే మా దగ్గర వర్షాలు లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నాం.

**-చిలువేరు భిక్షం, రైతు, సంస్థాన్ నారాయణపురం**

## రామానంద తీర్థలో టెక్నికల్ కోర్సులకు దరఖాస్తులు

భూదాన్ పోచంపల్లి, సెప్టెంబర్ 4 : మండలంలోని జలాల్‌పూర్ గ్రామం స్వామి రామానంద తీర్థ గ్రామీణ సంస్థలో దీన్ దయాల్ ఉపాధ్యాయ గ్రామీణ కౌశల్య యోజన ద్వారా సాంకేతిక శిక్షణకు అర్హత గల అభ్యర్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు సంస్థ డైరెక్టర్ పీఎస్ ఎస్ఆర్ లక్ష్మి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. మూడు నెలల కాల పరిమితితో కూడిన బేసిక్ కంప్యూటర్స్ (డాటా ఎంట్రీ ఆపరేటర్ ) కోర్సుకు ఇంటర్మీడియట్ పాస్ అయిన వారు అర్హులని పేర్కొన్నారు. ఒరిజినల్ సర్టిఫికెట్స్, జిరాక్స్ సెట్, పాస్ ఫొటోలు, ఆధార్ కార్డు, రేషన్ కార్డుతో ఈ నెల 9న ఉదయం 10 గంటలకు స్వామి రామానంద తీర్థ గ్రామీణ సంస్థలో ఇంటర్వ్యూలకు హాజరు కావాలని కోరారు. వివరాలకు 9133908000 , 9133908111 , 9133908222 , 9948466111 ఫోన్ నంబర్లలో సంప్రదించాలని సూచించారు.

# మన ఉపాధ్యాయులకు ఉత్తమ అవార్డులు

- ఉమ్మడి జిల్లాలో 10 మందికి రాష్ట్ర స్థాయి పురస్కారాలు
- పాఠశాల విద్యలో నలుగురికి, పాలిటెక్నిల్‌లో ఇద్దరికి, వర్సిటీ, ఉన్నత విద్యలో మరో నలుగురికి దక్కిన గౌరవం
- నేడు హైదరాబాద్‌లో అవార్డుల అందజేత


ఆర్.యూ. శిల్ప


కె.సుజాత


సి.హెచ్.గిరి ప్రసాద్


కె.కృష్ణకాంత్ నాయక్


కె.పద్మ


ఆర్.శ్రీధర్


అనిల్‌కుమార్


నీరజ


మిర్యాల రమేశ్‌కుమార్


కృష్ణయ్య

రామగిరి, సెప్టెంబర్ 4 : ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా విద్యాశాఖ బుధవారం రాష్ట్రస్థాయి ఉత్తమ ఉపాధ్యాయుల జాబితాను ప్రకటించింది. రాష్ట్ర వ్యాప్తంగా ఆరు విభాగాల్లో 71 మంది ఎంపిక చేయగా అందులో ఉమ్మడి నల్లగొండ జిల్లాకు చెందిన 10 మంది ఉండడం విశేషం. వీరిలో ఒకరు మహాత్మాగాంధీ యూనివర్సిటీ, ఒక గెజిటెడ్ ప్రధానోపాధ్యాయురాలు, ఇద్దరు స్కూల్ అసిస్టెంట్స్, ఒక పాలిటెక్నిక్ ప్రిన్సిపాల్, సీనియర్ అధ్యాపకురాలు, ముగ్గురు డిగ్రీ కళాశాల అధ్యాపకులు, ఒక జూనియర్ కళాశాల అధ్యాపకులు ఉన్నారు. అవార్డుకు ఎంపికైన వారిలో నల్లగొండ జిల్లాలో ఆరుగురు, సూర్యాపేట జిల్లాలో ఒకరు, యాదాద్రి భువనగిరి జిల్లాలో ఇద్దరు ఉన్నారు. వీరికి గురువారం హైదరాబాద్‌లో పురస్కారాలు అందజేయనున్నారు. ఉత్తమ ఉపాధ్యాయులుగా ఎంపిక కావడం వారు హర్షం వ్యక్తం చేశారు.

**మహాత్మాగాంధీ యూనివర్సిటీలో**

- మిర్యాల రమేశ్‌కుమార్, అసిస్టెంట్ ప్రొఫెసర్, డిపార్ట్‌మెంట్ ఆఫ్ బిజినెస్ మేనేజ్‌మెంట్

**పాఠశాల విద్యలో.**

- కె.పద్మ, గెజిటెడ్ ప్రధానోపాధ్యాయురాలు, ప్రభుత్వ ఉన్నత పాఠశాల, కాసనగోడు, కేతేపల్లి మండలం, నల్లగొండ జిల్లా
- కె.కృష్ణకాంత్ నాయక్, స్కూల్ అసిస్టెంట్, గణితం, ప్రభుత్వ ఉన్నత పాఠశాల, మిర్యాలగూడ, నల్లగొండ జిల్లా
- సి.హెచ్.గిరి ప్రసాద్, స్కూల్ అసిస్టెంట్ ఫిజిక్స్, జడ్పీహెచ్‌ఎస్, తిమ్మాపురం, చివ్వెంల మండలం, సూర్యాపేట జిల్లా

**ఉన్నత విద్యలో(డిగ్రీ కళాశాలలు)..**

- ఆర్.శ్రీధర్, అసిస్టెంట్ ప్రొఫెసర్, కామర్స్, ఎన్‌జీ కళాశాల నల్లగొండ
- ఎం.అనిల్‌కుమార్ అసిస్టెంట్ ప్రొఫెసర్, కెమిస్ట్రీ, ఎన్‌జీ కళాశాల
- తండు కృష్ణయ్య, అసిస్టెంట్ ప్రొఫెసర్, తెలుగు, ప్రభుత్వ డిగ్రీ కళాశాల, రామన్నపేట, యాద్రాద్రి భువనగిరి జిల్లా

**ప్రభుత్వ పాలిటెక్నికల్‌లో..**

- కె.సుజాత , ప్రిన్సిపాల్, ప్రభుత్వ పాలిటెక్నికల్ కళాశాల, సూర్యాపేట
- బి.నీరజ, సీనియర్ అధ్యాపకురాలు, ఈఈఈ, ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల, నల్లగొండ

**ఇంటర్మీడియట్ విద్యలో..**

- ఆర్.యూ. శిల్ప, జూనియర్ అధ్యాపకురాలు, కెమిస్ట్రీ, ప్రభుత్వ జూనియర్ కళాశాల, చౌటుప్పల్, యాదాద్రి భువనగిరి జిల్లా

### సులువుగా బోధించడంలో శిల్ప ప్రత్యేకం

చౌటుప్పల్ : చౌటుప్పల్ ప్రభుత్వ జూనియర్ కళాశాల రసాయన శాస్త్ర అధ్యాపకురాలు రామాయణం ఉమామహేశ్వర్ శిల్పకు విద్యార్థులకు పాఠాలు సులువుగా అర్థమయ్యేలా చెప్పడంలో సఫలీకృతులయ్యారు. కఠినమైన రసాయన పాఠ్యాంశాలను పేపర్ ప్రజెంటేషన్ ద్వారా బోధిస్తారు. వాటిని ప్రయోగాత్మకంగా చేయిస్తారు. వివిధ ప్రభుత్వ ప్రోగామ్స్, ఎన్‌సీసీ క్యాంప్‌లలో చురుగ్గా పాల్గొనడం. ఎంసెట్‌తోపాటు వివిధ ఎంట్రెన్స్ క్లాసులు కళాశాలలో ప్రత్యేకంగా చెప్పి విద్యార్థులను ప్రోత్సహిస్తున్నారు.

### పేద విద్యార్థుల సేవలో అనిల్‌కుమార్

పేదరికంలో ఉన్న ప్రతి విద్యార్థి ఉన్నత శిఖరాలను చేరుకోవాలనే లక్ష్యంతో 2011 నుంచి అధ్యాపకుడిగా సేవలందిస్తూ వస్తున్నారు ఎం.అనిల్‌కుమార్. వికారాబాద్ జిల్లా బంట్వారం మండలం తొర్మామిడి గ్రామానికి చెందిన ఆయన నల్లగొండలోని ఎన్‌జీ కళాశాలలో రసాయశాస్త్ర అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా పని చేస్తున్నారు. నల్లగొండ జిల్లాలోని పెద్దదేవులపల్లిలోని రెడ్డిల్యాబ్‌లో తన పరిశోధనతో పాటు కెమిస్ట్రీ విద్యార్థులకు పరిశోధనపై అవగాహన కల్పించారు. 2012–19వరకు తాను పనిచేసిన వివిధ కళాశాలల్లో ఎన్‌ఎస్‌ఎస్ అధికారిగా పనిచేశారు. తన సబ్జెక్టులో ఇప్పటి వరకు 10 ఇంటర్నేషనల్ జనరల్స్ ప్రచురించారు. మరో వైపు టి–శాట్(మన టీవీ)లో ఉన్నత విద్యామండలి ద్వారా పాఠాలను కూడా చెప్పారు. తనకు అవార్డు రావడం చాలా సంతోషంగా ఉందని, ఈ అవార్డు మరింత బాధ్యత పెంచిందని అనిల్‌కుమార్ తెలిపారు.

### ఉన్నత సేవలో..మిర్యాల

నల్లగొండ పట్టణానికి చెందిన మిర్యాల రమేశ్‌కుమార్ ఎంజీయూలో అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా పనిచేస్తున్నారు. జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో పలు పరిశోధన పత్రాలు సమర్పించారు. ఎంజీయూలో పరీక్షల నియంత్రణాధికారిగా, ప్రిన్సిపాల్‌గా, హెచ్ఓడీగా, ఐక్యూఐసీ డైరెక్టర్‌గా, డైరెక్టర్ ఆఫ్ అడ్మిషన్స్, హాస్టల్స్ డైరెక్టర్‌గా ఆయన పారదర్శకమైన సేవలందించారు. మరో వైపు ముగ్గురు విద్యార్థులకు పీహెచ్‌డీ పరిశోధనలకు అవకాశం ఇవ్వడంతో డాక్టరేట్ పొందారు.

### బోధన, పరిశోధనలో మేటి తండు కృష్ణయ్య

ఉపాధ్యాయుడిగా, అధ్యాకుడిగా 30 సంవత్సరాల బోధనానుభవాన్ని కలిగి ఎందరో విద్యార్థులను ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దారు తండు కృష్ణయ్య. మరో వైపు కవిగా, రచయితగా అనేక రచనలు చేసి సాహితీరంగంలో తనకంటూ ఒక స్థానాన్ని సంపాదించుకున్నారు. పలు పరిశోధన వ్యాసాలను రాశారు. కళాశాలలో విద్యార్థుల కోసం జాతీయ, రాష్ట్ర స్థాయి సదస్సులను నిర్వహించారు. విద్యార్థుల్లో స్వీయ అనభావాల పెంపుకోసం క్షేత్ర పర్యటనలు చేశారు. జూలై వరకు నల్లగొండ ఎన్‌జీ కళాశాల తెలుగు విభాగంలో పనిచేసి బదిలీల్లో భాగంగా ఇటీవల రామన్నపేట ప్రభుత్వ డిగ్రీ కళాశాలకు వెళ్లారు. తన సేవలను గుర్తించి ప్రభుత్వం అవార్డు ప్రకటించడం సంతోషంగా ఉందన్నారు.